## చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిరంతరం ప్రజాసేవకు అంకితమైన వారి జీవితం ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత సుభిక్షంగా పాలన అందించేందుకు దేవుడు వారికి మరింత శక్తినివ్వాలని కేసీఆర్ కోరుకున్నారు. చంద్రబాబు నాయుడికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, శాంతి సౌఖ్యాలతో ప్రజాసేవలో మమేకం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్టు ఆదివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

## రాష్ట్రంలో మరో రెండురోజులు వానలు

**వివిధ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ**

**హైదరాబాద్ వాతావరణ కేంద్రం**

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణా): రాష్ట్రంలో మరో రెండు రోజులు వానలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆదివారం సాయంత్రం హైదరాబాద్ నగరంతో పాటు సమీప ప్రాంతాలు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసినట్టు ఆ శాఖ అధికారులు తెలిపారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి-భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లోని పలు చోట్ల వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం కూడ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది. నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన పిడుగులు పడే అవకాశం ఉన్నదని హెచ్చరించింది.

# కేసీఆర్ పాలనే బెస్ట్!



### మౌలిక సదుపాయాలు

పల్లెప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అంతర్గత రోడ్లు, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు వంటి వసతులు అందుబాటులోకి వచ్చాయని గ్రోక్ తెలిపింది. పల్లెప్రగతి పథకం గ్రామాలను పరిశుభ్రంగా, పచ్చగా మార్చడంలో సహాయపడిందని పేర్కొంది.

మొదటిపేజీ తరువాయి...

క్షీణించిందని పేర్కొన్నది. ఇటీవల రవాణా శాఖ ఆదాయం తగ్గడాన్ని ఇందుకు ఒక ఉదాహరణగా పేర్కొన్నది. పదేండ్ల కేసీఆర్ పాలన, కాంగ్రెస్ 16 నెలల పాలనపై గ్రోక్ చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి.

**గ్రామాల్లో సంపూర్ణ పరివర్తన..**

'తెలంగాణలో గత దశాబ్దంలో గ్రామీణాభివృద్ధి గణనీయమైన పురోగతి సాధించింది' అని గ్రోక్ తెలిపింది. కేసీఆర్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిని ప్రాధాన్యంగా తీసుకున్నదని, బీఆర్ఎస్ పాలనలో పల్లెప్రగతి, గ్రామజ్యోతి వంటి కార్యక్రమాలు గ్రామాల్లో సంపూర్ణ పరివర్తనను తీసుకొచ్చాయని తెలిపింది. స్వపరిపాలన, ఆర్థిక సాధికారత వంటి అంశాల్లో గుణాత్మకమైన మార్పులు కనిపించాయని పేర్కొన్నది. ఈ పురోగతిలో కేసీఆర్ ప్రభుత్వం కీలకపాత్ర పోషించిందని తెలిపింది. 2014 నుంచి 2023 వరకు చేపట్టిన అనేక కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల స్థితిగతులను మెరుగుపరిచాయని వెల్లడించింది.

**కాంగ్రెస్ పాలనలో 11వ స్థానానికి..**

కాంగ్రెస్ హయాంలో తలసరి ఆదాయ వృద్ధి సైతం పడిపోయిందని గ్రోక్ పేర్కొంది. బీఆర్ఎస్ పాలనలో తలసరి ఆదాయం వేగంగా, స్థిరంగా పెరిగిందని, తెలంగాణను దేశంలో అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రాల స్థాయికి కేసీఆర్ ప్రభుత్వం తీసుకెళ్లిందని గ్రోక్ వెల్లడించింది. 2014-15లో తలసరి ఆదాయం రూ.1,24,104గా ఉండగా, 2023-24 నాటికి రూ.3,47,229కు చేరిందని తెలిపింది. తొమ్మిదేండ్లలో దాదాపు 180% వృద్ధిని నమోదు చేసిందని, సంవత్సరానికి సగటున 12-15% వృద్ధిరేటు సాధించిందని అభినందించింది. కాంగ్రెస్ 16 నెలల పాలనలో తలసరి ఆదాయ వృద్ధిరేటు గణనీయంగా తగ్గిందని గ్రోక్ స్పష్టంచేసింది. ఆర్థిక స్తబ్ధత సూచనలు కనిపిస్తున్నాయని తెలిపింది. 2024-25లో తలసరి ఆదాయ వృద్ధిరేటు 9.61 శాతంగా నమోదైందని, ఇది 2023-24లో 14.1%, 2022-23లో 16.2 శాతంతో పోలిస్తే చాలా తక్కువని పేర్కొంది. 16 నెలల కాలంలో సగటు వృద్ధిరేటు 6-7% మాత్రమే ఉండవచ్చని అంచనా వేసింది. 2024-25లో జాతీయ తలసరి ఆదాయ వృద్ధి 8-9% ఉంటుందని, తెలంగాణ ఈ సగటును అందుకోలేకపోయిందని తెలిపింది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి 2023-24 వరకు రాష్ట్రాల తలసరి ఆదాయ వృద్ధిలో టాప్-5లో ఉన్న తెలంగాణ, 2024-25లో 11వ స్థానానికి పడిపోయిందని వెల్లడించింది. మూలధన వ్యయం తగ్గడం (రూ.44,252 కోట్ల నుంచి రూ.32,745 కోట్లకు), 16 నెలల్లో రూ.లక్షన్నర కోట్లు అప్పులు చేయడం, జీఎస్టీ వసూళ్లు తగ్గడం వంటివి ఇందుకు కారణాలుగా తెలిపింది.






### తగ్గుతున్న ప్రజల కొనుగోలు శక్తి

కాంగ్రెస్ హయాంలో ఆర్థిక వృద్ధి మందగించడం ప్రజల కొనుగోలు శక్తి తగ్గడానికి ఒక సూచిక అని గ్రోక్ హెచ్చరించింది. ఇటీవల రవాణా శాఖ ఆదాయం తగ్గడంపై ఏఐ చాట్‌బాట్ స్పందించింది. రవాణా శాఖ ఆదాయం తగ్గడం ఒక ఆందోళనకర అంశంగా పేర్కొన్నది. 'ఎందుకంటే ఇది రాష్ట్ర ఆర్థిక ఆరోగ్యానికి ఒక ముఖ్యమైన సూచిక. రవాణా శాఖ ఆదాయం వాహన రిజిస్ట్రేషన్లు, పర్మిట్లు, పన్నులు, జరిమానాల ద్వారా సమకూరుతుంది. ఇవి ప్రజల ఆర్థిక సామర్థ్యం, వాణిజ్య కార్యకలాపాల స్థాయిని ప్రతిబింబిస్తాయి. రవాణా శాఖ ఆదాయం తగ్గడం కొనుగోలు శక్తి తగ్గడాన్ని సూచిస్తుంది. ఇది వ్యాపారాలు, రియల్ ఎస్టేట్, వ్యవసాయ రంగాల్లో క్షీణతతో ముడిపడి ఉండవచ్చు' అని గ్రోక్ అభిప్రాయపడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన మహాలక్ష్మి వంటి ఉచిత రవాణా సేవలు ఆర్టీసీ ఆదాయాన్ని గణనీయంగా దెబ్బతీస్తున్నాయని, రోజుకు రూ.5 కోట్ల నష్టం వస్తుందన్న అంచనాలు ఉన్నాయని తెలిపింది. ఈ పథకం అమలుకు ఏడాదికి రూ.10,000 కోట్లు అవసరమని ఆర్టీసీ అంచనా వేయగా, బడ్జెట్‌లో రూ.4,305 కోట్లే ప్రతిపాదించిందని విమర్శించింది. రియల్ ఎస్టేట్, హోటల్ రంగాల్లో కుదేలవడంతో వాహన కొనుగోళ్లు తగ్గి, రవాణా శాఖ ఆదాయంపై ప్రతికూల ప్రభావం పడిందని అభిప్రాయపడింది.

**జీఎస్టీ వసూళ్లు ఆందోళనకరం**

కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో జీఎస్టీ వసూళ్లు భారీగా తగ్గాయని కూడా గ్రోక్ తెలిపింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో జీఎస్టీ వసూళ్ల వృద్ధిని పోల్చితే స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తుందని వివరించింది.

- కేసీఆర్ ప్రభుత్వంలో జీఎస్టీ వసూళ్లు స్థిరమైన వృద్ధిని సాధించాయని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంలో ఇది కీలక పాత్ర పోషించిందని గ్రోక్ పేర్కొన్నది. 2017లో జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి, తెలంగాణ జీఎస్టీ వసూళ్లు సంవత్సరానికి సగటున 15-20% వృద్ధిరేటు సాధించిందని తెలిపింది. జాతీయ సగటు వృద్ధిరేటు (10-12%) కంటే ఎక్కువ సాధించడం విశేషమని అభినందించింది.
- కాంగ్రెస్ ప్రభుత్వంలో జీఎస్టీ వసూళ్ల వృది తగ్గిందని గ్రోక్ పేర్కొంది. 2024-25లో సగటున 5-6 శాతానికి పరిమితమైందని తెలిపింది. 2025 మార్చిలో రూ.5,401 కోట్లు వసూలు కాగా, 2024 మార్చితో పోలిస్తే (రూ.5,399 కోట్లు) వృద్ధిరేటు 0 శాతంగా నమోదైంది. కేసీఆర్ పాలనలో జీఎస్టీ వసూళ్ల వృద్ధిలో దేశంలో తెలంగాణ టాప్-5లో ఉండేదని, కాంగ్రెస్ హయాంలో 14వ స్థానానికి పడిపోయిందని తెలిపింది.

**వ్యవసాయ సంబంధిత పథకాలు**

కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ వంటి సాగునీటి పథకాలు గ్రామీణ రైతులకు సాగు సౌలభ్యం కల్పించాయని, 24 గంటల ఉచిత విద్యుత్తు, రైతుబంధు, రైతుబీమా వంటివి రైతుల జీవన ప్రమాణాలను పెంచాయని గ్రోక్ పేర్కొన్నది.


**స్వపరిపాలన**

పంచాయతీలకు నిధులు నేరుగా విడుదల చేయడం, ఈ-పంచాయతీ వంటి డిజిటల్ వ్యవస్థల ద్వారా పంచాయతీల్లో పారదర్శకత, వాటి సామర్థ్యం పెరిగాయని గ్రోక్ తెలిపింది. 2023లో తెలంగాణ గ్రామ పంచాయతీలు జాతీయ స్థాయిలో 13 అవార్డులు గెలుచుకోవడం దీనికి నిదర్శనమని స్పష్టం చేసింది.

**సామాజిక సంక్షేమం**

దళితబంధు, ఆసరా పింఛన్లు వంటి పథకాలు గ్రామీణ పేదల ఆర్థికస్థితిని బలోపేతం చేశాయని గ్రోక్ తెలిపింది. వీటికి తోడు స్త్రీనిధి లాంటి స్వయం సహాయక బృందాల ద్వారా బీఆర్ఎస్ సర్కారు మహిళల సాధికారతకు దోహదపడిందని తెలిపింది.

### 16 నెలల్లో ఆర్థికం ఆగమాగం..



**కేసీఆర్** హయాంలో తెలంగాణలో జీఎస్డీపీ గణనీయంగా పెరిగిందని గ్రోక్ స్పష్టంచేసింది. రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామి ఆర్థిక శక్తిగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిలిపిందని వెల్లడించింది. ఇదే సమయంలో 16 నెలల కాంగ్రెస్ పాలనలో ఆర్థిక సంక్షోభ సూచనలు కనిపిస్తున్నాయని గ్రోక్ హెచ్చరించింది. రెండు ప్రభుత్వాల పాలనలో తేడాను గణాంకాలతో సహా వెల్లడించింది.

బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ జీఎస్డీపీ 2014-15లో రూ.5.05 లక్షల కోట్ల నుంచి 2023-24 నాటికి రూ.15.01 లక్షల కోట్లకు చేరుకుందని గ్రోక్ తెలిపింది. దాదాపు 196.9% వృద్ధిని సాధించినట్టు చెప్పింది. తద్వారా దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా తెలంగాణ నిలిచినట్టు వెల్లడించింది. 2014-15 నుంచి 2022-23 వరకు సగటు వృద్ధి రేటు 12.7% ఉందని, ఇది జాతీయ సగటు 10.5% కంటే ఎక్కువని గ్రోక్ స్పష్టంచేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ వంటి సాగునీటి పథకాలు, 24 గంటల ఉచిత విద్యుత్తు, రైతుబంధు, రైతు బీమా వంటి వ్యవసాయ సంబంధిత సంస్కరణలు, సేవల రంగంపై (ముఖ్యంగా ఐటీ) దృష్టి పెట్టడం వంటివి ఈ వృద్ధికి దోహదపడ్డాయని తెలిపింది.

కాంగ్రెస్ ప్రభుత్వం 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత, దాదాపు 16 నెలల పాలనలో (ఏప్రిల్ 2025 వరకు) జీఎస్డీపీ వృద్ధిరేటు, ఆర్థిక పురోగతి మునుపటి కంటే తగ్గినట్టు కనిపిస్తున్నదని గ్రోక్ పేర్కొంది. 2024-25లో జీఎస్డీపీ 10.12%గా ఉందని తెలిపింది. ఇది 2023-24లో బీఆర్ఎస్ హయాంలో సాధించిన 11.9% కంటే తక్కువని పేర్కొంది. 2024-25లో 18 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో పోలిస్తే తెలంగాణ జీఎస్డీపీ వృద్ధిలో 14వ స్థానంలో నిలిచినట్టు పేర్కొన్నది. గతంలో తెలంగాణ టాప్-3 రాష్ట్రాల్లో ఉండగా.. కాంగ్రెస్ పాలనలో గణనీయంగా పతనమైనట్టు తెలిపింది.

## కొన్నది 5 లక్షల టన్నులే



మొదటిపేజీ తరువాయి...

తానే సొంతంగా సరఫరా చేయాలనే ఆలోచనలో ఆగ్రోస్ ఉన్నట్టు సమాచారం. ఇందుకోసం ఇటీవల సంస్థకు చెందిన ఇద్దరు కీలక అధికారులు గుజరాత్, పంజాబ్ రాష్ట్రాల్లో పర్యటించినట్టు తెలిసింది. అక్కడ పలు సంస్థలతో మాట్లాడుకొని సరఫరా చేసేలా అంతర్గతంగా ఒప్పందం చేసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇందుకోసం టెండర్ల ప్రక్రియను కావాలనే వాయిదా వేసినట్టు తెలిసింది.

**నెల రోజులు... 5 లక్షల టన్నులు**

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యమే ఉదాహరణగా నిలుస్తున్నది. మార్చి 20 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించినట్టు పౌరసరఫరాల సంస్థ ప్రకటించింది. ఇప్పటివరకు 5.77 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. నెల రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు కనీసం ఆరు లక్షల టన్నులు కూడా దాటకపోవడం గమనార్హం. ఒకవైపు రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం పోసి రోజుల తరబడిగా వారు ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 7,337 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం చెప్తున్నప్పటికీ, అవి కేవలం పేపర్లకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో వేయింగ్ మిషన్లు, తేమ మిషన్లు, ప్యాడీ క్లీనర్లు, గన్నీ సంచులను అందుబాటులో ఉంచలేదని తెలిసింది. 7,337 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోలు చేసింది 5.77 లక్షల టన్నులు. ఈ లెక్కన ఒక్కో కొనుగోలు కేంద్రంలో సరాసరిగా 78 టన్నులు మాత్రమే కొనుగోలు చేసినట్టు లెక్క!

## ఒకట్రెండు రోజుల్లో సివిల్స్ ఫలితాలు

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): యూపీఎస్సీ సివిల్స్ తుది ఫలితాలు ఒకట్రెండు రోజుల్లో విడుదలయ్యే అవకాశాలున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం లేదా మంగళవారం ఫలితాలు విడుదలకానున్నాయి. అఖిల భారత సర్వీసుల్లోని 1,056 పోస్టుల భర్తీకి యూపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. జూన్ 16న ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించగా, సెప్టెంబర్ 20 -29 వరకు మెయిన్స్ పరీక్షలను నిర్వహించారు. జనవరి 7 నుంచి ఈ నెల 17 వరకు ఇంటర్వ్యూలు జరిగాయి.



### సెల్‌ఫోన్‌కే ఎప్‌సెట్ ఫలితాలు

**రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఫలితాలు పంపించేలా ఏర్పాటు**

హైదరాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): టీజీ ఎప్‌సెట్ ఫలితాలను విద్యార్థులు దరఖాస్తు సమయంలో రిజిస్టర్డ్ చేసుకున్న సెల్‌ఫోన్ నంబర్‌కే పంపించేలా జేఎన్టీయూ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ వంటి కోర్సుల్లో సీట్ల భర్తీకి నిర్వహించే టీజీ ఎప్‌సెట్ పరీక్షలు ఈనెల 29 నుంచి మే నెల 4 వరకు జరగనున్నాయి. ఈసారి 3.05లక్షల మంది విద్యార్థులు ఎప్‌సెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షలు ముగిసిన తర్వాత 10రోజుల్లో ఫలితాలు విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు. కాగా, ఇప్పటి వరకు ఫలితాలను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. ఈసారి విద్యార్థుల సెల్‌ఫోన్ నంబర్‌కే పంపించాలని నిర్ణయించారు. దీంతో అభ్యర్థులకు వెబ్‌సైట్‌లో వెతకాల్సిన తిప్పలు తప్పుతాయి.

# కాలేయ రోగులకు కొత్త జీవితం

### కేసీఆర్ ముందు చూపుతో ఆరోగ్యశ్రీలోకి అవయవ మార్పిడి చికిత్స

- **సంక్లిష్ట సర్జరీలతో ప్రపంచ రికార్డులు సృష్టిస్తున్న ఉస్మానియా**
- **2018లో విజయవంతంగా ఆటో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్**
- **ఇప్పటివరకు 42 మందికి ఉచితంగా కాలేయ మార్పిడి**
- **పైసా ఖర్చులేకుండా 5 వేల మందికి జీఐ కాంప్లెక్స్ సర్జరీలు**
- **300 లివర్ క్యాన్సర్ ఆపరేషన్లు**



హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): సంక్లిష్టమైన కాలేయ శస్త్రచికిత్సల కోసం కార్పొరేట్ దవాఖాలను ఆశ్రయించినా ఫలితం లేక ప్రాణాలపై ఆశలు వదిలేసుకుంటున్న ఎంతో మంది రోగులను ఉస్మానియా దవాఖాన వైద్యులు అక్కున చేర్చుకుని భరోసా కల్పిస్తున్నారు. అరుదైన కాలేయ వ్యాధులతో బాధపడే రోగులకు, ముఖ్యంగా చిన్నారులకు అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించి రికార్డులు బ్రేక్ చేస్తున్నారు. నిత్యం వందలాదిగా వచ్చే రోగులతో పని ఒత్తిడి పెరిగినప్పటికీ లెక్కచేయకుండా గంటల తరబడి సమయం వెచ్చించి అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగడం వల్లనే ఇది సాధ్యమవుతున్నదని ఉస్మానియా వైద్యులు చెప్తున్నారు.

**కేసీఆర్ చొరవ వల్లే**

అవయవ మార్పిడి శస్త్రచికిత్సల్లో గుండె మార్పిడి తర్వాత అత్యంత ఖరీదైనది కాలేయ మార్పిడే. రోగి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా ఈ శస్త్రచికిత్సకు కార్పొరేట్ దవాఖానలో రూ.30 లక్షల నుంచి రూ.40లక్షల వరకు ఖర్చవుతుంది. దీనితోపాటు ఇతర కాలేయ శస్త్రచికిత్సలు, వాటికి అవసరమయ్యే మందులు సైతం ఖరీదైనవే. అంత ఖర్చును భరించే ఆర్థిక స్తోమత లేక ఎంతో మంది రోగులు తమ ఆస్తులను అమ్ముకుని రోడ్డు పాలవుతుంటే.. ఆస్తులు లేని రోగులు ఏకంగా ప్రాణాలనే కోల్పోతున్నారు. అలాంటివారి దైన్యస్థితికి చలించి గతంలో కేసీఆర్ ప్రభుత్వం అవయవ మార్పిడి శస్త్రచికిత్సలతోపాటు ఇతర ఖరీదైన చికిత్సలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చింది. దీంతో ఏటా వేలమంది నిరుపేద రోగులు పూర్తి ఉచితంగా ఆ శస్త్రచికిత్సలను చేయించుకుంటున్నారు. అందులో భాగంగా 2015వ సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఒక్క ఉస్మానియా దవాఖానలోనే 42 మంది కాలేయ రోగులకు విజయవంతంగా లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీలు చేయడంతోపాటు 5 వేల జీఐ కాంప్లెక్స్ సర్జరీలు, 300 లివర్ క్యాన్సర్ సర్జరీలు నిర్వహించారు.

**అరుదైన శస్త్రచికిత్సలతో ప్రపంచ రికార్డులు**

అరుదైన శస్త్రచికిత్సల నిర్వహణకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఉస్మానియా సర్జికల్ గ్యాస్ట్రో, మెడికల్ గ్యాస్ట్రో వైద్యనిపుణులు 2018లో ఆటో లివర్ ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతంగా జరిపి ప్రపంచ రికార్డు సృష్టించారు. 6 వారాల వయసున్న ఓ చిన్నారిలో కాలేయానికి రక్తాన్ని సరఫరా చేసే నాళాలు సరిగ్గా వృద్ధి చెందకపోవడంతో అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించారు. అందులో భాగంగా ఆ చిన్నారి కాలేయాన్ని తొలగించి కొంత సేపు బయట పెట్టారు. రక్తనాళాలను పునరుద్ధరించిన తర్వాత మళ్లీ అదే కాలేయాన్ని ఆ చిన్నారికి అమర్చారు. ప్రపంచంలో ఇలాంటి శస్త్రచికిత్స నిర్వహించడం ఇది రెండోసారి. గతంలో తొలిసారి కెనడాలో ఈ తరహా సర్జరీ జరిగినట్టు ఉస్మానియా సర్జికల్ గ్యాస్ట్రో విభాగాధిపతి డాక్టర్ మధుసూదన్ తెలిపారు. 'అలిగెలి' సిండ్రోమ్‌తోపాటు గుండె సమస్యతో బాధపడుతున్న మరో రెండేండ్ల చిన్నారికి సైతం లివర్ ట్రాన్స్‌ప్లాంట్‌తో పునర్జన్మ ప్రసాదించిన ఉస్మానియా వైద్యులు.. తాజాగా అరుదైన 'మార్ఫన్' రుగ్మతతోపాటు కాలేయ వ్యాధితో బాధపడుతున్న 14 ఏండ్ల బాలుడికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీ నిర్వహించి ప్రపంచంలోనే తొలిసారి ఈ ఘనత సాధించారు.

**ప్రభుత్వ సహకారంతోనే సాధ్యం..**



ప్రభుత్వ సహకారంతోనే నిరుపేద రోగులకు అత్యంత ఖరీదైన, సంక్లిష్టమైన సర్జరీలను ఉస్మానియా దవాఖానలో ఉచితంగా చేయగలుగుతున్నాం. ఇటీవల 14 ఏండ్ల బాలుడికి జరిపిన కాలేయ మార్పిడి శస్త్రచికిత్స ప్రపంచంలోనే మొదటిది. గతంలో ఎక్కడా ఇలాంటి శస్త్రచికిత్సలు జరిగిన దాఖలాలు లేవు. అత్యంత క్లిష్టమైన కేసులకు కూడా ఉస్మానియా దవాఖానలో లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీలు చేస్తున్నాం. అలా 2015 నుంచి ఇప్పటివరకు 42 కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు చేశాం. ఆ రోగుల్లో 12 మంది చిన్నారులు కూడా ఉన్నారు. వీరితోపాటు 5 వేల మందికి జీఐ కాంప్లెక్స్ సర్జరీలు, 300 మందికి లివర్ క్యాన్సర్ సర్జరీలు నిర్వహించాం. ఇవన్నీ ఆరోగ్యశ్రీ పథకం కింద పూర్తి ఉచితంగా చేసినవే. నిరుపేద రోగులకు ఉచితంగా వైద్యాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

**– డాక్టర్ మధుసూదన్, ఉస్మానియా దవాఖాన సర్జికల్ గ్యాస్ట్రో విభాగాధిపతి**

# 5,000 కోట్ల ఎంవోయూ!

మొదటిపేజీ తరువాయి...

రూ.5,000 కోట్లు పెట్టుబడి పెడ్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకోగా.. ఏపీలో రూ.5,700 కోట్ల పెట్టుబడికి బాబు సర్కార్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం గమనార్హం. ఉనికే లేని ఉర్సా క్లస్టర్ సంస్థకు బాబు సర్కారు విశాఖలో ఏకంగా 59 ఎకరాలు కట్టబెట్టడం వివాదాస్పదమవుతున్నది.

**అడ్రస్ లేని కంపెనీతో ఒప్పందం!**

ఈ ఏడాది జనవరిలో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ లయబిలిటీ కంపెనీతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నది. ఇందులో భాగంగా సదరు కంపెనీ తెలంగాణలో 100 మెగావాట్ ఏఐ డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు రూ. 5,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. ఈ ఏడాది జనవరి 24న ఈ ఒప్పందం జరుగగా, అప్పటికి ఆ కంపెనీ కార్యకలాపాలను ప్రారంభించనేలేదు. కేవలం ఒప్పందానికి మూడునెలల ముందు.. గత సెప్టెంబర్ సెప్టెంబర్ 27న ఆ సంస్థ యూఎస్‌లో రిజిస్టరైంది. ఇవన్నీ సంస్థపై అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. యుఎస్‌లో కంపెనీ రిజిస్టర్ అయిన అడ్రస్‌లో కంపెనీకి సంబంధించిన ఎటువంటి ఆనవాళ్లూ లేవని, కనీసం ఫోన్ నంబర్, ఈ-మెయిల్ అడ్రస్ కూడా లేవనే ఆరోపణలున్నాయి. రిజిస్ట్రేషన్ వేళ సమర్పించిన వివరాల ఆధారంగా చూస్తే.. 'సింగిల్‌ట్రీ సిటీ ప్లెసాంటన్, సీఏ-94588-యూఎస్ఏ' అడ్రస్‌లో ఓ 1,560 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఓ ట్రిపుల్ బెడ్‌రూం ఇల్లు మాత్రమే ఉన్నది. అక్కడ కనీసం పదిమంది ఉద్యోగులు కూడా లేరనే విమర్శలున్నాయి. అంతేకాదు, ఉర్సా ఎల్ఎల్‌సీ అండ్ ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనుబంధ సంస్థలుగా ఉన్నాయని, ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఈ మధ్యనే ఏప్రిల్ మొదటి వారంలో జరిగిన బోర్డు సమావేశంలో ఉర్సా క్లస్టర్స్ లిమిటెడ్ లయబిలిటీ కంపెనీ షేర్లు బదలాయించినట్లు రికార్డులు చెప్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి దాదాపు 10 వేల కోట్లకుపైగా విలువైన ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చిన ఈ రెండు కంపెనీలకు కనీసం ఒక ఫోన్ నంబర్ కానీ, ఈ-మెయిల్ ఐడీ కానీ లేవు. దీంతోపాటు ఈ రెండు కంపెనీలు ఇప్పటివరకు ఎలాంటి కార్యకలాపాలు చేసిన దాఖలాలూ లేవు. ఇన్నివేల కోట్లు పెట్టుబడులు పెట్టే కంపెనీలకు కనీసం సరైన ఆఫీస్ కూడా లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. అయితే సంస్థ వివరాలేవీ చూడకుండా ప్రభుత్వాలు ఒప్పందానికి వెళ్లడం అనుమానాలకు తావిస్తున్నది.

**డైరెక్టర్లు ఇద్దరూ తెలుగువారే!**

ప్రభుత్వం విదేశీ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటున్నట్టు ప్రచారం చేసుకుంటున్నప్పటికీ.. అక్కడున్న తెలుగువారితోనే ఒప్పందాలు చేసుకుంటుండటం గమనార్హం. కేంద్ర కంపెనీ వ్యవహారాల మంత్రిత్వశాఖ వెబ్‌సైట్ వివరాల ప్రకారం ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా సరిగ్గా రెండు నెలలక్రితం 2025 ఫిబ్రవరి 12న ప్రారంభమైంది. రూ.10 కోట్ల ఆథరైజ్డ్ క్యాపిటల్‌తో ఇద్దరు డైరెక్టర్లతో ఈ కంపెనీ రిజిస్టర్ చేశారు. ఇందులో డైరెక్టర్లుగా కౌశిక్ పెందుర్తి, సతీశ్ అబ్బూరి ఉన్నారు. కౌశిక్ పెందుర్తి ప్రస్తుతం 'టాలస్ పే' అనే కంపెనీలో సీపీటీవోగా విధులు నిర్వహిస్తుట్టు ఆయన లింక్డిన్ అకౌంట్ తెలియజేస్తున్నది. అంటే కౌశిక్ అమెరికాలో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఓ స్థాయిలో పనిచేస్తున్న ప్రైవేటు ఉద్యోగి అని తెలుస్తున్నది. ఇక సతీశ్ అబ్బూరి 'ఎల్సీయం అనలిటిక్స్'కు వ్యవస్థాపకుడు, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీంతోపాటు యూఎస్‌లో రిజిస్టర్ అయిన ఉర్సా క్లస్టర్స్ లిమిటెడ్ లయబిలిటీ కంపెనీలోనూ ఈ ఇద్దరే డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్నారు. అయితే ఉర్సా క్లస్టర్స్ లిమిటెడ్ లయబిటీ కంపెనీని కూడా ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల తరువాత, అంటే 2024 సెప్టెంబర్ 27న రిజిస్టర్ చేశారు. ఈ కంపెనీకి అనుబంధ సంస్థగా చెప్పుకొంటూ ఇండియా ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థను 2025 ఫిబ్రవరి 19న రిజిస్టర్ చేశారు. ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అడ్రస్‌గా 'ఫ్లాట్ నంబర్-705, ఏక్తా బాసిల్ హైట్స్, కొత్తగూడ, హైదరాబాద్' చిరునామాతో ఒక రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌ను చూపించారు. కాగా, అక్కడ కూడా ఎటువంటి కార్యాలయం లేకపోగా.. ఈ మూడు బెడ్రూమ్‌ల ఫ్లాట్‌లో ఓ కుటుంబం నివాసం ఉంటుండటం గమనార్హం. కేవలం 2 నెలల వయసున్న, కనీసం ఒక ఆఫీస్, ఫోన్‌నంబర్, వెబ్‌సైట్ కూడా లేని కంపెనీతో ఇటు తెలంగాణ, అటు ఏపీ రాష్ట్రాలు వేల కోట్ల రూపాయల పెట్టుబడి ఒప్పందాలు చేసుకోవడం, ఏపీ ప్రభుత్వం రూ.వందల కోట్ల విలువ చేసే భూములను కంపెనీకి కేటాయించడం సందేహాలకు తావిస్తున్నది.

**తెరవెనుక ఎవరు?**

రూ.10 కోట్ల క్యాపిటల్ ఇన్వెస్టిమెంట్‌తో మొదలైన కంపెనీ రెండు తెలుగు ప్రభుత్వాలతో వేల కోట్లు పెట్టుబడులు పెట్టడానికి ఎలా ఒప్పందం కుదుర్చుకోగలిగిందన్నది అందరినీ విస్మయపరుస్తున్నది. దీనివెనుక ఎవరున్నారనేది ఆసక్తిగా మారింది. ఒప్పందాలు జరగడానికి కొద్దిరోజుల క్రితమే కంపెనీలు రిజిస్టర్ కావడం, అందులో డైరెక్టర్లుగా ఉన్న ఇద్దరూ తెలుగువారే కావడం, రెండు తెలుగు రాష్ట్రాలతో ఒప్పందాలు చేసుకోవడం పలు సందేహాలకు తావిస్తున్నది. అటు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇటు తెలంగాణ సీఎం రేవంత్ దావోస్‌లో పెట్టుబడుల కోసం పోటాపోటీగా ప్రయత్నించినట్టు అప్పట్లో ప్రభుత్వ వర్గాలు ప్రచారం చేసుకున్నాయి. ఆ సందర్భంగా ప్రకటించిన పెట్టుబడుల్లో నిజాయితీ ఎంతని విపక్ష పార్టీలు ప్రశ్నిస్తూ వచ్చాయి. షెల్ కంపెనీలతో పెట్టుబడుల దోబూచులాట జరుగుతున్నదన్న అనుమానాలనూ అవి వ్యక్తంచేశాయి. ఈ నేపథ్యంలో రూ.5,728 కోట్ల ప్రాజెక్టు విశాఖలో ఏర్పాటు చేసేందుకు ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నది. ముఖ్యమంత్రి అధ్యక్షతన ఈనెల 10న జరిగిన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ సమావేశంలో 17 సంస్థలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా, ఆయా పరిశ్రమల స్థాపనకు వివిధ జిల్లాల్లో భూముల కేటాయింపునకు చంద్రబాబు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి 59 ఎకరాల భూమిని కేటాయించింది. మార్కెట్ ధర ప్రకారం ఆ భూమి విలువ రూ.వెయ్యి కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇటు తెలంగాణ ప్రభుత్వంతో రూ.5,000 కోట్ల ఒప్పందం చేసుకున్న కంపెనీతోనే ఏపీ సైతం ఒప్పందం చేసుకోవడం గమనార్హం.

**పెట్టుబడులా.. కట్టుకథలా?**

దావోస్ సదస్సు సందర్భంగా జరిగిన ఒప్పందాల్లో చాలావరకు ఇటువంటి కంపెనీలే అని పరిశ్రమ వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే గోడి ఇండియా, స్వచ్ఛ్ బయో కంపెనీలపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. ఈ పరిస్థితుల్లో ఉర్సా సంస్థ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఊరూపేరూ లేని కంపెనీలు పెట్టుబడి పెడ్తామంటూ ముందుకురావడం, వాటిని గొప్పగా చెప్పుకుంటూ ప్రభుత్వం వందలకోట్ల విలువైన భూమిని వాటికి కేటాయించడం.. అంతా లోపాయికారి వ్యవహారంలా కనిపిస్తున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ప్రకటిస్తున్న పెట్టుబడుల్లో పారదర్శకత ఉన్నదా అన్న అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తొలిసారి 2024 జనవరిలో రూ.40వేల కోట్లు, 2025లో రూ.1.79 లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకొచ్చినట్టు రేవంత్ సర్కార్ గొప్పలకు పోయింది. అయితే ఆ పెట్టుబడుల్లో ఏ ఒక్కటీ ఇంతవరకు పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చిన దాఖలాల్లేవు.